

# కాంపెన్సేషన్

శిరీష

తిరుపాలు కుప్పకూలిపోయాడు. బాలమ్మ రోడ్డుమీద రక్తపు మడుగులో పడిఉంది. మెడనులిమిన కోడిపెట్టలా గిలగిలా తన్నుకుంటూంది జనమంతా చుట్టూమూగారు

బాలమ్మ తిరుపాలు కూతురు ఎనిమిదేళ్లు నిండిన వయస్సు. లారీ బాలమ్మనూ బాలమ్మ నెత్తిమీద వేడతట్టనూ యాక్సిడెంటు చేసింది. బాలమ్మ కుడికాలు నుగ్గునుగ్గు అయ్యింది.

బాలమ్మ కాళ్ళు చేతులు కొట్టుకోవడం ఆపేసింది. అచేతనంగా పడిపోయింది.

"బాలమ్మా!" అరిచాడు తిరుపాలు. బాలమ్మను చేతుల్లోకి జవురుకున్నాడు.

కృష్ణమూర్తి శ్వాస చూసాడు. నాడి పరీక్ష జేశాడు.

"ఇంకా ప్రాణం ఉంది. కాంపౌండర్ సూర్యనారాయణని పిలవండి" కేక పెట్టాడు కృష్ణమూర్తి. కృష్ణమూర్తి ఎలిమెంటరీ స్కూలు టీచరు.

"అబ్బా కాస్త తప్పుకోండయ్యా! గాలి రానివ్వండి గొర్రెదాటుగా మూగిపోతే ఎలా." కృష్ణమూర్తి జనాన్ని దూరంగా నెట్టాడు

తిరుపాలు భార్య గుండెలు బాదుకుంటూ వచ్చింది.

"మంగీ! మన బాలమ్మ మంగీ! గోరమైపోయింది. లారీ గుద్దేసింది సూడు మంగీ సూడు" ఎడమచేత్తో బాలమ్మ తల పట్టుకొని కుడిచేతిలోకి బాలమ్మ గడ్డం తీసుకొని ముఖం చూపించి ఏడ్చాడు తిరుపాలు

"ఓ తల్లో! బాలమ్మో! నన్నన్యాయం చేసిపోకే కూతురో" మంగమ్మ రోదించింది.

''తిరుపాలూ! కాస్త తప్పుకో. ఏమిటా మొండితనం, బాలమ్మ కేంకాలేదు. షైత్యం కమ్మంది అంతే తప్పుకోండి. కాస్త గాలి రానియ్యండయ్యా. మీ పాసు గూలా" కృష్ణమూర్తి తిరుపాలునూ మంగమ్మనూ వేరుచేశాడు.

కాంపౌండర్ సూర్యనారాయణ కిట్ పట్టుకొని వచ్చాడు. సూదివేశాడు. కాలి నుండి రక్తస్రావం ఆగేందుకు ప్రాథమిక చికిత్స చేశాడు గాలివిసిరాడు. బాలమ్మ కదిలింది. తిరుపాలుకు గోరంత ఆశ కలిగింది.

"ప్రాణానికేం ఫరవాలేదు. కాలుదే తెలియకుండా ఉంది. బహుశః తీసివేయాల్సి వస్తుందేమో!" చెప్పాడు కాంపౌండరు సూర్యనారాయణ.

"అయ్యో నా తల్లి రాత పాడుగానూ! కాలు తీసివేస్తే దాని బతుకేంగాను నేను సూడలేనయ్యా ఈ గోరం" గుండెలు బాదుకుంది మంగమ్మ.

"కాలు తీసేసి కుంటిదాన్ని జేసే కంటే ప్రాణాలు తీసుకపోయినా నయమే" అందుకున్నారక్కడెవరో.

"ఆడదాని బ్రతుకే ఒక అవిటి బ్రతుకు. కాలుజారినా కాలు పోయినా మరీ అధ్వాన్నం అయిపోతుంది." చెపుతూంది ఒకామె.

"మీరంతా ఊరుకోండమ్మా కాసేపు. ఇప్పుడు కాలుకేమైందని. పెద్దాసుపత్రికి పోతే తెలుస్తుందిగదా" అన్నాడు కృష్ణమూర్తి."

"పెద్దాసుపత్రిపొయ్యే ఏర్పాట్లేమైనా చేస్తున్నారా? అంతా రామాయణం పెట్టుకూర్చుకుంటే ఎట్లాగండిరా" మోరీ మీద చుట్ట కాలుస్తూ కూర్చున్న ముసలాయన అన్నాడు.

"పోలీసులొచ్చి కేసు రికార్డుజేసుకోందే తీసుకెళ్ళగూడదటయ్యా! లారీవోళ్ళు తరిమారప్పుడే మనిషిని" జనంలో నుంచి వచ్చాయి మాటలు.

"లారీ గోటూరు ప్రెసిడెంట్‌దే గదరా. డ్రైవరూ, క్లీనరూ ఏరీ?'' ముసలాయన అరిచాడు.

లారీడ్రైవరూ, క్లీనరూటీకొట్టు ముందు బెంచీమీద కూర్చుని టీ త్రాగుతున్నారు. లారీని రోడ్డుప్రక్కన నిలిపారు.

గోటూరు ప్రెసిడెంటు వచ్చాడు డ్రైవరూ, క్లీనరూ టీ గ్లాసులు పడేశారు. ప్రెసిడెంటును అనుసరించారు. డ్రైవరు తలగోక్కుంటూ నిల్చున్నాడు. క్లీనరు తలవంచి కాలితో నేలను రాస్తున్నాడు.

ప్రెసిడెంటుకు గుంపు దారిచ్చింది. బాలమ్మవైపు చూశాడు ప్రెసిడెంటు. "ఊ!!" గట్టిగా నిశ్వసించాడు.

" అలా ఒకరి మొఖం ఒకరు చూస్తూ నిల్చుంటే ఎలాగయ్యా! ఆ పిల్లని పట్టుకొచ్చి జీపులో వెయ్యండి. పెద్దాసుపత్రికి తీసుకెడదాం" ముఖం చిట్లించి అన్నాడు ప్రెసిడెంటు.

"పోలీసు వాళ్లొచ్చేదాకా తీయకూడదని మేమే ఉంచామయ్యా" డ్రైవరు అన్నాడు.

"అవతల పిల్ల చావుబ్రతుకుల్లో ఉంటే పోలీసోళ్ళకోసం చూస్తావటయ్యా వెర్రిమొఖమా...పద...పద! పిల్లను ఎత్తుకరండి" ప్రెసిడెంటు జీపులో ముందు సీటెక్కి కూర్చున్నాడు.

బాలమ్మతోబాటు తిరుపాలూ, మంగమ్మా, కృష్ణమూర్తి వెనక సీట్లో ఎక్కారు. జీపుకదిలింది.

పెద్దాసుపత్రికి ఇంకా పదిమైళ్ళు పోవాలి. బాలమ్మ బాధతో మూలుగుతూంది. జీపు వేగం పుంజుకుంది.

"కాలు తీసివేయాల్సి వొస్తుందంటాడయ్యా కాంపౌండర్ సూర్యనారాయణ" మెల్లిగా అన్నాడు కృష్ణమూర్తి ప్రెసిడెంటుతో.

"నా బిడ్డ కాలు పోకుండా సూడండి బంగారుదొరా...అది అవిటిదైతే నేను బతకలేను" మంగమ్మ ఏడ్చింది "

"తిరుపాలూ నువ్వేమీ దిగులుపడకు దానికెంత ఖర్చయినా నేను భరిస్తాను నీ బిడ్డ సుఖంగా ఇల్లుచేరే విధాయకం నే చూస్తాగా" హామీ ఇచ్చాడు ప్రెసిడెంటు.

"మీ మాటమీద మాకేం అనుమానం లేదయ్యా! పిల్లకి కాలు తీసెయ్యాల్సి వొస్తే తమరుమాత్రం ఏంజేయగలరూ అని" కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ అన్నాడు తిరుపాలు.

"దాని ఖర్మ అంతదాకా వస్తే మనం ఏంచేయగలంచెప్పు తిరుపాలూ" నముదాయింపుగా అన్నాడు కృష్ణమూర్తి.

"అంతదాకా వచ్చినాసరే నువ్వేమీ దిగులుపడనక్కర్లేదు. కాలు తీసేస్తే ఇన్షూరెన్సువాళ్ళు మూడువేలిస్తారు. నా తంగేడు మడకదగ్గరుండే బంజరు మూడెకరాలూ నీమీద పట్టాతెప్పించియిస్తా తిరుపాలూ! సరేనా?" ప్రెసిడెంటు మాటల సరళిలో రాజీ ఉంది.

తిరుపాలుకు ఆ మాటలతో తల కొట్టినట్లయింది. ఏడుపు మళ్ళీ ముంచుకొచ్చింది.

"ఇంకెందుకుచెప్పుతిరుపాలూదిగులు. ప్రెసిడెంటుగారు అంతగా ధైర్యమిస్తున్నారుగదా! ఇంకా ఎందుకయ్యా ఏడుపు" వీపుమీద తట్టుతూ అన్నాడు కృష్ణమూర్తి.

"ఏలూ ఎకరాలూ ఏంజేస్తాయయ్యా ఆడపిల్లకి కాలులేనిదానికంతా కాని కాలమేనయ్యా" మంగమ్మ ప్రేగుల్లోనుండి వచ్చింది స్వరం.

"డబ్బుంటే అవిటితనం దేనికీఅడ్డురాదు మంగమ్మా! పైగా రబ్బరుకాలు అమర్చుకోవచ్చుగా!" కృష్ణమూర్తి అన్నాడు.

"రబ్బరుకాలు దేనికి పనికొస్తుందయ్యా! దాని మనువు మాటేమిటి" మెల్లిగా అన్నాడు తిరుపాలు.

"ఎప్పుడో జరగబొయ్యే మనువును

గురించి ఇప్పుడే ఎట్లా చెప్పతావయ్యా! అప్పటికి కాలం ఎట్లా మారుతుందో ఏమో! మీరేమీ ఇక మారు మాట్లాడకండి. పోలీసులొస్తే ఇది పిల్ల పొరబాటేనని సర్దండి. మిగతా అంతా అయ్యగారు చూసుకుంటారు" అన్నాడు కృష్ణమూర్తి.

పెద్దాసుపత్రివద్ద జీపు ఆగింది. బాలమ్మను చేతులమీద పట్టుకొచ్చి బెంచీమీద పెట్టారు. డాక్టరూ, నర్సులూ హడావుడిగా పరుగెత్తారు.

గోటూరు ప్రెసిడెంటువెళ్ళి స్పెషలిస్టు డాక్టర్ని జీపులో ఎక్కించుక వచ్చాడు. డాక్టరు బాలమ్మను పరీక్షజేశాడు.

"ప్రస్తుతానికి ట్రీట్‌మెంటు చేస్తాను. ఇరవైనాలుగు గంటలు చూడాలి. కాలు బతికి అతుక్కొనేదీ లేనిదీ ఆలోగాతెలుస్తుంది. అంతకీ అవసరమొస్తే రేపు కాలు తీసివేయాలి" ప్రెసిడెంటుతో చెప్పాడు డాక్టరు.

బాలమ్మను ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకవెళ్ళారు. వెళ్ళేముందు తిరుపాలును చూసి "అయ్యా!" పెద్దగా మూలుగుతూ అంది బాలమ్మ.

"బాలమ్మా!" కౌగలించుకున్నాడు తిరుపాలు. ఇద్దరికీఆవేశంఒకేసారిముంచుకొచ్చింది బాలమ్మ స్పృహలోనే ఉంది.

"నేను వస్తా తిరుపాలూ...పోలీసు స్టేషనుకు వెళ్ళి రిపోర్టిచ్చి లారీ విడిపించుకొనివస్తా ... డాక్టరుతో నేనన్నీ మాట్లాడినాలే. కృష్ణమూర్తీ! నువ్వీరాత్రికిక్కడే వాళ్ళకు తోడుగా ఉండవయ్యా! రేపు వెళుదువుగానిలే. నేను హెడ్మాష్టరుకు చెప్పిపంపుతాలే." మాటలు ముగింపక ముందే జీపు ఎక్కాడు ప్రెసిడెంటు.

"అలాగేనయ్యా!" కృష్ణమూర్తి నమస్కరిస్తూ అన్నాడు. కృష్ణమూర్తి బాగా లౌకికుడు. ప్రెసిడెంటు మంచి చూపుల్లో ఉండడం ఉత్తరోత్తరా ఎందుకైనా మంచిదని తెలుసు.

జీపు పోలీసుస్టేషను వైపు మళ్ళింది.

తిరుపాలూ మంగమ్మా ఆపరేషన్ థియేటర్ ముందు బెంచీమీద కూలబడ్డారు. కృష్ణమూర్తి కాఫీకి వెళ్ళాడు.

బాలమ్మ కాలు కూర్పువేసి కట్టుకట్టి స్ట్రెచర్‌మీద బయటికి తెచ్చారు. ఇంకా మైకంలోనే వుంది.

బాలమ్మను బెడ్‌మీదికి చేర్చారు. తిరుపాలూ మంగమ్మా ప్రక్కనేఉన్నారు.

డాక్టరు ఇంటికి తిరిగి పోతున్నాడు. తిరుపాలు ఆయన్ను వెంబడించాడు. "నా బిడ్డ కాలు తీసెయ్యకుండా సూడండి బాబూ? అంతా నేదరి పిల్లలు కూటికి గతిలేనివాళ్ళం." చేతులు కట్టుకొని అన్నాడు తిరుపాలు.

"అలాగే చూద్దాం. నా ప్రయత్నమంతా చేస్తాను. తర్వాత దేవుడిదయ! ఇంతకూ రేపటికిగానీ ఏమాటా చెప్పలేను." డాక్టరు వెళ్ళిపొయ్యాడు.

కృష్ణమూర్తి కాఫీ తాగి వచ్చాడు. తిరుపాలూ, కృష్ణమూర్తి ఔట్‌గేటు దగ్గర కూర్చున్నారు.

"కాలునుగురించి నువ్వేమీ బాధ పడకు తిరుపాలూ. అసలు నన్నడిగితే కాలుతీసివేస్తేనే మంచిది. మంచి కాంపెన్సేషన్ వస్తుంది. మూడువేలడబ్బూ, మూడెకరాలూ ఉంటే నీ బ్రతుకన్నా చక్కబడుతుంది" ప్రబోధించాడు కృష్ణమూర్తి.

"అట్లాగంటే ఎట్లాగయ్యా; కాలుతీసే సినపిల్ల ఈ జనమమంతా మాకు కుంపటేగదయ్యా. మామాట అటుంచి ఇప్పుడంటే అది పసిది. పెద్దదై బుద్ధి తెలిసొస్తే దానికి అంతకంటె గోడు ఇంకేముంటుందయ్యా" బాధగా అన్నాడు తిరుపాలు.

"ఆఁ! కాలమే దాన్ని మరిపించేస్తుంది. నువ్వేమైనా దానికాలు నరికేశావా!" బీడీ పీలుస్తూ అన్నాడు కృష్ణమూర్తి

"ప్రెసిడెంటు జీపు తిరిగి వచ్చింది. ప్రెసిడెంటు రాలేదు. జీపు డ్రైవరుతో వందరూపాయలు పంపాడు. ఇచ్చి వెళ్ళాడు డ్రైవరు. తిరుపాలు డబ్బు కృష్ణమూర్తి చేతికిచ్చాడు.

తిరుపాలుకూ మంగమ్మకూ అన్నం పొట్లాలు తెచ్చాడు కృష్ణమూర్తి. ఎంగిలి పడ్డారిద్దరూ. కృష్ణమూర్తి లాడ్జిలో రూము తీసుకున్నాడు.

బెడ్ ప్రక్కనే నేలమీద తువ్వాలు పరిచి పడుకున్నాడు తిరుపాలు. మంగమ్మ మోకాళ్ళమీదే తూగుతూ కూర్చుంది.

తిరుపాలుకు మగతగా నిద్రవచ్చింది. ఆ మగతలోనే కన్పించారు తానెరిగిన కుంటివాళ్ళందరూ. బిచ్చాల రాజన్న కూతురు రామి పుట్టుకతోనే కుంటిది. అదిగూడా దాని అయ్యతో గూడా బిచ్చమెత్తుకుంటూంది. ఆ అవిటితనమే దానికి బతుకుదెరువైంది. పెళ్ళీ పెడాకులూ ఏమీ కాలేదు దానికి.

బాణాల సుబ్బరాయుడు కూతురు సుబ్బులుకు రైల్లోంచి దూకబోయి కాలు పోయింది అసలే చెడిన దాని బ్రతుకు కాలుపోవడంతో సుబ్బరాయుడి గుండె మీద కుంపటై కూర్చుంది.

దుంపల నారాయణస్వామి మరదలు చిన్నక్కకుఏదోజబ్బువల్ల కాలుతీసేశారు. ఆస్తి పోతుందని ఆ పిల్లను నారాయణ స్వామే రెండో పెళ్ళి చేసుకున్నాడు. ఇప్పుడు చిన్నక్కకు ఇద్దరు బిడ్డలు.

పెద్దింటి చిట్టెమ్మలుకు కారు యాక్సిడెంటులో కాలుపోయింది! పట్నంలో రబ్బరుకాలు పెట్టించారు. ఇప్పుడు సైకిలు గూడా తొక్కుతూంది.

రామి, సుబ్బులూ, చిన్నక్కా, చిట్టెమ్మలూ అంతా కలిసి తిరుపాలు కడుపులో దేవుతున్నారు. మెదడులో సుడులు త్రిప్పుతున్నారు. గుండెను బండబారిస్తున్నారు.

"బాలమ్మా!" గావుకేకపెట్టి లేచి కూర్చున్నాడు తిరుపాలు. బాలమ్మ కళ్లు తెరిచింది. దాని పెదవులు తడిపింది మంగమ్మ. నైట్‌డ్యూటీ నర్సు తిరుపాలును బయటికి పంపేసింది.

తిరుపాలు గేటువైపు నడిచాడు. చెలరేగిన సమస్య సంఘర్షణలో చిక్కుకుంది.

ఈ ఘోరాన్ని తలుచుకుంటేనే శరీరం కంపించిపోతూంది.

బాలమ్మను కాలులేకుండా తను చూడలేడు. మంగమ్మ ఎంతోకాలం బ్రతకదు. ఈ నిరాశావాదం ఒకవైపు లాగుతూంది. ఇంతకంటె బాలమ్మ చచ్చిపోయి ఉండినా బాగుండేది.

ఆశావాదం గుండెలకెక్కింది. ప్రెసిడెంటు దేవుడిలా ఆదుకుంటున్నాడు. దేవుడు దయవల్ల కాలు బాగుపడితే ఎన్ని కష్టాలైనా భరించవచ్చు

చప్పున స్ఫురించింది

కాలుతీసివేయకపోతే మూడువేల రూపాయలూ ఇవ్వరేమో. మూడెకరాల పొలంగురించి ప్రెసిడెంటుని ఎలా అడగగలడు. కాలుతీసేస్తేగానీ మూడువేలూ మూడెకరాలూ రావన్నమాట

కృష్ణమూర్తి ప్రబోధం గుర్తుకొచ్చింది.

డబ్బుంటే అవిటితనమేమీ అడ్డు రాదు మంగమ్మా!"

"కాలు తీసివేస్తేనే మంచిది మంచి కాంపెన్సేషన్ వస్తుంది."

"మూడువేలూ, మూడెకరాలు ఉంటే బ్రతుకైనా బాగుపడుతుంది."

"ఆఁ! కాలమే అన్నీ మరిపిస్తుంది,"

చిన్నక్కా, చిట్టెమ్మలూ నైతిక బలాన్నిస్తున్నారు తిరుపాలుకు.

తలవేడెక్కింది. గుండెబరువెక్కింది. కాళ్ళక్రింద భూమి కంపించింది.

"ఛీ! ఛీ! పాడు మొనుసు" తిరుపాలు తన్నుతానే తిట్టుకున్నాడు. ఆ రాత్రంతా జాగరణే అయింది తిరుపాలుకు.

ప్రాణంకన్నా మిన్నగా ప్రేమించిన వారి క్షేమంకోసం దేన్నైనా త్యాగం చేయడానికి వెనుదీయడు మనిషి. మరి ఆ మనిషి మనుగడకు ఏది క్షేమమో నిర్ణయించుకోవడమే వివేకం. జీవితం సార్థకమౌతుందో నిరర్థకమౌతుందో ఎవరూ చెప్పలేరు. జీవనలతకు పట్టుకొమ్మ ఏదైనా దొరకాలి. పరిస్థితులు అనుకూలించకపోతే ఏదో ఒక ఆసరా చూసుకోవాలి. అది మంచిదారైతే జీవితం ఎల్లాగో ఈడ్చుకపోవచ్చు. ముళ్ళదారిమాత్రం కాకూడదు. సెంటిమెంట్సును పట్టుకొని వ్రేళ్ళాడి బ్రతుకు బాటను దుర్గమం చేసుకోవడంఅవివేకం. ఆ వివేకస్ఫూర్తే తిరుపాలునూ ఆవరించింది. ఆలోచనలలోనే తెల్లవారింది.

ఎనిమిదింటికే స్పెషలిస్టు డాక్టరు కారు హాస్పిటల్ పోర్టికోలో ఆగింది. డాక్టరు కారు దిగాడు. తిరుపాలు కారు వైపు పరుగెత్తాడు.

"ఏమి? ఏమయింది?" కంగారుగా అడిగాడు డాక్టరు.

"ఏమీకాలేదుదొరా! పిల్లదానికాలుతీసెయ్యండిదొరా! దాని కాలుతీసెయ్యండి!" గాద్గదికంగా అన్నాడు తిరుపాలు.